# దుష్ప్రచారమే పెనుముప్పు!

- తప్పుడు సమాచారం అతిపెద్ద ముప్పుగా ఉన్న దేశాల్లో మొదటిస్థానంలో భారత్
- ఎన్నికల వేళ దుష్ప్రచార వ్యాప్తిపై ప్రపంచ ఆర్థిక వేదిక ఆందోళన



న్యూఢిల్లీ: భారత్, అమెరికా, బ్రిటన్, మెక్సికో సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఈ ఏడాది ఎన్నికలు జరుగనున్నాయి. దాదాపు 300 కోట్ల మంది ఎన్నికల క్రతువులో భాగం కానున్నారు. అయితే తప్పుడు సమాచార వ్యాప్తి ఎన్నికలకు పెను ముప్పుగా పరిణమించిందని, ఆయా దేశాల్లో ఎన్నికల ఫలితాలపైనా, ప్రజాస్వామ్య మనుగడపైనా ఇది తీవ్ర ప్రభావం చూపించనున్నదని ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) గ్లోబల్ రిస్క్ నివేదిక-2024 ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్థిక, పర్యావరణ, రాజకీయ, భౌగోళిక, సాంకేతిక తదితర 34 ముప్పులపై నివేదిక ర్యాంకులను ప్రకటించింది. తప్పుడు సమాచారం అతిపెద్ద ముప్పుగా ఉన్న దేశాల్లో భారత్ తొలిస్థానంలో ఉన్నది. అమెరికా ఆరో స్థానంలో ఉన్నది.

**తప్పుడు సమాచారం అతిపెద్ద ముప్పుగా ఉన్న దేశాలు**

| దేశం | స్థానం |
|---|---|
| భారత్ | 1 |
| అమెరికా | 6 |
| యూకే | 11 |
| మెక్సికో | 11 |
| ఇండోనేషియా | 18 |

# బెంగళూరులో మిస్సింగ్.. హైదరాబాద్‌లో ప్రత్యక్షం

**సోషల్ మీడియా ద్వారా బాలుడి ఆచూకీ**



బెంగళూరు, జనవరి 24: కర్ణాటక రాజధాని బెంగళూరులో మూడు రోజుల కిందట కనిపించకుండా పోయిన 12 ఏండ్ల బాలుడిని హైదరాబాద్‌లో గుర్తించారు. సోషల్ మీడియా సాయంతో బాలుడి ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. గత ఆదివారం ఉదయం 11 గంటలకు బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ వద్ద కోచింగ్ సెంటర్ నుంచి బయటకు వచ్చిన పరిణవ్.. తిరిగి ఇంటికి వెళ్లకుండా, మైసూర్ నుంచి చెన్నై.. అటు నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి మెట్రో స్టేషన్ వద్ద ఓ మహిళ పరిణవ్‌ను గుర్తించింది. 'బెంగళూరులో మిస్సింగ్ అయ్యింది నువ్వే కదా?' అని ఫొటో చూపి అడిగింది. అవునని పరిణవ్ సమాధానం చెప్పటంతో సమీపంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించింది. తమ పిల్లాడు హైదరాబాద్‌లో ఉన్న విషయం తెలుసుకున్న బాలుడి తల్లిదండ్రులు ఎంతగానో సంతోషించారు. బాలుడి ఆచూకీ కనుగొనడంలో సాయం అందించిన సోషల్ మీడియా యూజర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహుల్ అరెస్ట్ : హిమంత

గువాహటి: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని లోక్‌సభ ఎన్నికల అనంతరం అరెస్ట్ చేయనున్నట్లు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ బుధవారం చెప్పారు. శివ్‌సాగర్ జిల్లాలోని నజీరాలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న శర్మ మీడియాతో మాట్లాడారు. రాహుల్ భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా మంగళవారం గువాహటిలోకి ప్రవేశించేందుకు బారికేడ్లను తొలగించాలని కార్యకర్తలను రెచ్చగొట్టినట్లు కేసు నమోదైందని చెప్పారు. హింసను ప్రేరేపించారని, అనంతరం జరిగిన ఘర్షణలో కొందరు కాంగ్రెస్ నేతలు, నలుగురు పోలీసులు గాయపడ్డారని తెలిపారు. డీజీపీ జీపీ సింగ్ మాట్లాడుతూ, ఈ కేసును అస్సాం సీఐడీకి బదిలీ చేసినట్లు తెలిపారు.

# ఇండియా కూటమికి బీటలు

## బెంగాల్‌లో ఒంటరిగానే పోటీ: మమత

### కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం

- ఎన్నికల తర్వాతే జాతీయ స్థాయిలో పొత్తుపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడి
- దీదీ బాటలోనే ఆమ్‌ఆద్మీ పార్టీ.. పంజాబ్‌లో ఒంటరిపోరేనన్న సీఎం మాన్
- లోక్‌సభ ఎన్నికల ముంగిట ప్రతిపక్ష కూటమికి గట్టి ఎదురుదెబ్బ

కలిసి కనీసం ఒక్కసారి కూడా ఎన్నికల్లో పోటీ చేయనే లేదు. అప్పుడే కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష 'ఇండియా' కూటమికి బీటలు వారుతున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓడించడమే తమ లక్ష్యమని పేర్కొన్న కూటమిలోని పార్టీల తీరు ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా తయారైంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేస్తామని తాజాగా తృణమూల్ కాంగ్రెస్, ఆప్ ప్రకటించాయి.



కోల్‌కతా/చండీగఢ్, జనవరి 24: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లో ఒంటరిగానే పోటీచేస్తామని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ బుధవారం ప్రకటించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర గురువారం బెంగాల్‌లో అడుగుపెట్టనున్న నేపథ్యంలో మమత ప్రకటన సంచలనంగా మారింది. సీట్ల పంపకం విషయంలో తాను కాంగ్రెస్‌కు ఒక ప్రతిపాదన చేశానని, అయితే అందుకు ఆ పార్టీ అంగీకరించలేదని మమత తెలిపారు. బీజేపీని ఓడించేందుకు ఏమైనా చేస్తామన్నారు. సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్, తృణమూల్ మధ్య చర్చలు నడుస్తున్నాయన్న వార్తలను ఆమె కొట్టివేశారు. ఈ విషయంపై తాను కాంగ్రెస్‌లోని ఎవరితో చర్చించలేదని పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తో టీఎంసీకి ఎలాంటి సంబంధం లేదని, రాష్ట్రంలో వారి జోక్యాన్ని సహించేది లేదని మమత ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అయితే జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో తమ పార్టీ భాగస్వామిగా ఉన్నదని, ఎన్నికల తర్వాత పొత్తుపై నిర్ణయం తీసుకొంటామని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీలన్నీ ఐక్యంగా ఉంటాయని, ప్రతిపక్ష కూటమి ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని కాంగ్రెస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

**కూటమికి టీఎంసీ ముఖ్యమైన పిల్లర్**

రాహుల్ యాత్రపైనా మమత తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలోకి గురువారం ప్రవేశించనున్న వారి యాత్ర గురించి కూటమిలో భాగస్వామిగా ఉన్న తమకు కనీసం సమాచారం ఇవ్వలేదని, ఆ మర్యాద కూడా వారికి(కాంగ్రెస్) లేదని అసహనం వ్యక్తం చేశారు. కాగా, మమత ప్రకటనపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పందించారు. ఇండియా కూటమికి టీఎంసీ పార్టీ ముఖ్యమైన పిల్లర్ అని, ఆ పార్టీ లేకుండా కూటమిని ఊహించుకోలేమని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ మాట్లాడుతూ అసలు ఇండియా కూటమికి సిద్ధాంతం అనేది లేదని, కేవలం మోదీ వ్యతిరేక వేదికగానే ఏర్పడిందని విమర్శించారు.

**కాంగ్రెస్‌కు రెండే సీట్లు ఇస్తాం!**

సీట్ల సర్దుబాటు విబేధాలే మమత తాజా ప్రకటనకు కారణమని తెలుస్తున్నది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 42 లోక్‌సభ సీట్లలో టీఎంసీ 22, కాంగ్రెస్ 2, బీజేపీ 18 స్థానాల్లో గెలిచాయి. గత ఎన్నికల్లో ప్రదర్శన ప్రకారం హస్తం పార్టీకి మమత రెండు స్థానాలు ఆఫర్ చేసినట్టు సమాచారం. అయితే తమకు 10-12 సీట్లు కావాలని కాంగ్రెస్ అడుగ్గా.. అందుకు మమత అంగీకరించలేదని టీఎంసీ వర్గాలు పేర్కొన్నాయి.

**ప్రమాదంలో మమతకు స్వల్పగాయం**

సీఎం మమత ప్రయాణిస్తున్న కారు బుధవారం రోడ్డు ప్రమాదానికి గురైంది. బర్ధమాన్ నుంచి కోల్‌కతాకు వస్తుండగా.. అకస్మాత్తుగా ఆమె కాన్వాయ్‌కు ఎదురుగా ఒక వాహనం వచ్చింది. దీంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో.. ముందు సీట్లో కూర్చొన్న మమత విండ్‌షీల్డ్‌కు ఢీకొన్నారు. దీంతో ఆమె తలకు స్వల్ప గాయమైందని అధికారులు వెల్లడించారు.

**దీదీ బాటలోనే ఆప్**

పంజాబ్‌లో ఆమ్‌ఆద్మీ పార్టీ కూడా అన్ని లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తుందని రాష్ట్ర సీఎం భగవంత్‌మాన్ బుధవారం పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని మరోసారి స్పష్టం చేశారు. మొత్తం 13 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించి పంజాబ్‌లో చరిత్ర సృష్టిస్తామని మాన్ అన్నారు. 13 స్థానాల్లో ఇప్పటికే 40 మంది ఆశావహులను షార్ట్‌లిస్టు చేశామని తెలిపారు. ఛండీగఢ్ స్థానంలో కూడా పోటీచేస్తామని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, గోవా, గుజరాత్‌లలో సీట్ల పంపకం విషయంలో కాంగ్రెస్, ఆప్ మధ్య విభేదాలు నెలకొన్నట్టు తెలుస్తున్నది.

# వచ్చే నెల 16న భారత్ బంద్

- రైతు సంఘాల ప్రకటన
- ఎంఎస్పీకి చట్టబద్ధత సహా సమస్యల పరిష్కారానికి డిమాండ్



నోయిడా, జనవరి 24: రైతు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వచ్చే నెల 16న భారత్ బంద్ చేపట్టనున్నట్టు భారతీయ కిసాన్ యూనియన్ అధికార ప్రతినిధి రాకేశ్ టికాయిత్ చెప్పారు. బుధవారం ఆయన ముజాఫర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'పంటలకు కనీస మద్దతు ధర లభించడంలేదు. అసలు ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎంఎస్పీకి చట్టబద్ధత ఏదీ?. ఇదే కాదు.. రైతులకు సంబంధించిన చాలా విషయాలను కేంద్రం పట్టించుకోవడం లేదు' అని విమర్శించారు. అలాగే దేశంలో నిరుద్యోగం, అగ్నివీర్ పథకం, పెన్షన్ పథకాల్లో సమస్యలు ఉన్నాయని, వీటిని కేంద్రం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. వీటన్నింటినీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లడానికి భారత్ బంద్ చేపడుతున్నట్టు వెల్లడించారు. ఈ బంద్‌లో సంయుక్త కిసాన్ మోర్చాతోపాటు అన్ని రైతు సంఘాలు పాల్గొంటాయని టికాయిత్ చెప్పారు. ఫిబ్రవరి 16న రైతులు తమ పొలాలకు వెళ్లకుండా నిరసన తెలుపుతారని పేర్కొన్నారు. ఈ బంద్‌లో రవాణా రంగం కార్మికులతోపాటు ఇతర వర్గాల వాళ్లు కూడా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## జ్ఞానవాపి నివేదికను బహిరంగపర్చొద్దు

- ఇరువర్గాలకూ నివేదిక ఇవ్వాలని స్థానిక కోర్టు తీర్పు

వారణాసి, జనవరి 24: వారణాసిలోని జ్ఞానవాపి మసీదు శాస్త్రీయ సర్వే రిపోర్టును ప్రజాబాహుళ్యంలో ఉంచకూడదని స్థానిక కోర్టు ఆదేశించింది. ఈ కేసులో పిటిషన్‌దారులైన ఇరు వర్గాలకు (హిందూ, ముస్లిం వర్గాలు) ఈ రిపోర్టును అందజేయాలని సూచించింది. పిటిషన్‌దారులు కూడా తాము ఈ రిపోర్టును బహిరంగపర్చమంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే చేపట్టి నివేదికను అందజేయాలన్న ఆదేశాల మేరకు భారత పురావస్తు శాఖ సర్వే చేసి కోర్టుకు రిపోర్టును ఇటీవల సమర్పించిన విషయం తెలిసిందే. అయితే ఈ రిపోర్టును ప్రజలకు అందుబాటులో ఉంచాలా? వద్దా? అన్న దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా కోర్టు తీర్పునిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంచకూడదని ఆదేశించింది.

## కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ.8,500 కోట్లు

**కేంద్ర క్యాబినెట్ ఆమోదం**

న్యూఢిల్లీ: కోల్, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.8,500 కోట్ల ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదించింది. కోల్-టు-ఎస్ఎన్‌జీ (సింథటిక్ నేచురల్ గ్యాస్) ప్రాజెక్టు ఏర్పాటుకు పచ్చ జెండా ఊపింది. కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్), గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (జీఏఐఎల్) కలిసి రూ.13,052.81 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తాయి.



బుధవారం తెల్లవారుజామునే అయోధ్య బాలరాముడి దర్శనానికి వచ్చిన భక్తులు

# రెండో రోజు 3 లక్షలు

- అయోధ్య రామయ్య దర్శనానికి యాత్రికుల క్యూ
- భక్తుల రద్దీ నేపథ్యంలో దర్శన వేళలు పొడిగింపు

అయోధ్య: సాధారణ భక్తులకు అందుబాటులోకి వచ్చిన అయోధ్య రామయ్యను దర్శించుకొనే వారి సంఖ్య భారీగా ఉంటున్నది. తొలిరోజు 5 లక్షల మంది భక్తులు దర్శించుకోగా, రెండో రోజు (బుధవారం) 3 లక్షల మంది మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. పటిష్ఠ భద్రత మధ్య భక్తులను దర్శనానికి పంపిస్తున్నారు. అయోధ్యలో భక్తుల రద్దీ నేపథ్యంలో కేంద్ర క్యాబినెట్ మంత్రులు ప్రస్తుతం దర్శనానికి వెళ్లొద్దని ప్రధాని మోదీ సూచించినట్టు సమాచారం. ప్రొటోకాల్స్ దృష్ట్యా సామాన్య భక్తులకు అసౌకర్యం కలుగుతుందని, ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రులు మార్చిలో బాలరాముడి దర్శనానికి వెళ్లాలని సూచించినట్టు తెలిసింది.

**రాత్రి 10 గంటల వరకు దర్శనం**

రామయ్య దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్న నేపథ్యంలో దర్శన వేళలను పొడిగిస్తూ రామ తీర్థ్ ట్రస్టు నిర్ణయం తీసుకొన్నది. సాయంత్రం 7 గంటల వరకే ఉన్న దర్శన సమయాన్ని రాత్రి 10 గంటల వరకు పొడిగించారు. కాగా, దర్శనానికి 10-15 రోజుల తర్వాతే రావాలని అధికారులు భక్తులను కోరుతున్నారు. మరోవైపు రద్దీని తగ్గించేందుకు అయోధ్యకు బస్సు సర్వీసులను నిలిపివేశారు.



అయోధ్య ఆలయ ట్రస్ట్ విడుదల చేసిన మూడో బాలరాముడి విగ్రహం

**గర్భగుడిలోకి వానరం**

అయోధ్య రామాలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. మంగళవారం ఓ వానరం రాముడిని దర్శించుకొన్నది. దక్షిణ ద్వారం గుండా ఆలయంలోకి వచ్చిన వానరాన్ని వెళ్లగొట్టేందుకు సిబ్బంది పరుగెత్తుకు రాగా,అది ఏ అపాయం చేయకుండా, రాముడి విగ్రహం దగ్గరికి వెళ్లి అనంతరం ఉత్తర ద్వారం గుండా బయటికి వెళ్లిపోయింది. దీనికి సంబంధించిన వీడియోను ట్రస్టు సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీన్ని చూసిన భక్తులంతా.. ఆంజనేయస్వామి రాముడిని దర్శించుకొని వెళ్లాడని పేర్కొంటున్నారు.

**జటాయు విగ్రహ తయారీకి 3 నెలలు**

అయోధ్యలోని కుబర్ తిలలో ప్రధాని ప్రారంభించిన జటాయు విగ్రహ తయారీకి 3 నెలలు పట్టిందని శిల్పి రామ్ సుతార్(99) తెలిపారు. దాని గురించి రిసెర్చ్ చేయటానికే 2నెలలు పట్టిందని చెప్పారు. 3.5 టన్నుల బరువున్న ఈ విగ్రహాన్ని కాపర్ (85%), టిన్ (5%), జింక్ (5%), సీసం (5%) మిశ్రమాలతో తయారుచేసినట్టు వివరించారు.

# దూసుకుపోతున్న ట్రంప్

- ప్రైమరీ ఎన్నికల్లో వరుస విజయాలు
- రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిగా లైన్‌క్లియర్!
- తన పోరాటం ఆగదన్న నిక్కీ హేలీ



వాషింగ్టన్, జనవరి 24: రిపబ్లికన్ పార్టీ తరపున అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసులో డొనాల్డ్ ట్రంప్ దూసుకుపోతున్నారు. ఇప్పటికే గత వారం జరిగిన అయోవా కాకస్ ప్రైమరీ ఎన్నికల్లో గెలిచిన మాజీ అధ్యక్షుడు.. తాజాగా న్యూ హ్యాంప్‌షైర్ రిపబ్లికన్ ప్రైమరీలోనూ విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న భారత సంతతికి చెందిన నిక్కీ హేలీపై ట్రంప్ గెలిచారు. ట్రంప్‌నకు దాదాపు 55 శాతం ఓట్లు రాగా.. సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నిక్కి హేలీకి 43 శాతం ఓట్లు దక్కాయి. ఇప్పటికి కేవలం రెండు రాష్ట్రాల్లో మాత్రమే రిపబ్లికన్ ప్రైమరీ ఎన్నికలు జరిగినప్పటికీ.. ట్రంప్‌కు ఇప్పటికే దక్కిన విజయాలు రిపబ్లికన్ పార్టీలో ఆయన ఆధిపత్యాన్ని చూపుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే కుట్రతో సహా 91 క్రిమినల్ అభియోగాలు ఎదుర్కొంటునప్పటికీ.. ట్రంప్ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో దూసుకుపోతుండటం గమనార్హం. అయితే రేసు అయిపోలేదని, ఇంకా చాలా రాష్ట్రాలు ఉన్నాయని నిక్కీ హేలీ పేర్కొన్నారు. 'నేను ఒక ఫైటర్‌ని. పోరాటం కొనసాగుతుంది' అని పేర్కొన్నారు. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో వివేక్ రామస్వామితో సహా ఇతరులు తప్పుకోవడంతో.. ట్రంప్, నిక్కీ హేలీ మాత్రమే పోటీలో నిలిచారు. మరోవైపు ఎలాంటి ప్రచారం లేకుండానే డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ న్యూ హ్యాంప్‌షైర్ ప్రైమరీ ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లోనూ ట్రంప్, బైడెన్ మధ్యనే పోటీ జరిగే అవకాశం కనిపిస్తున్నది.

## 'ఈబే'లో 1000 మంది ఉద్యోగులపై వేటు



లండన్, జనవరి 24: కాలిఫోర్నియాకు చెందిన మల్టీనేషనల్ ఆన్‌లైన్ రిటైల్ కంపెనీ 'ఈబే' పెద్ద ఎత్తున ఉద్యోగాల తొలగింపునకు తెరలేపింది. సంస్థలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 1000 మంది ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్టు ప్రకటించింది. ఉద్యోగుల వేతనాల బిల్లు, కంపెనీ వ్యవహారాల ఖర్చు.. వ్యాపారానికి మించి ఉండటం, మరోవైపు ఆర్థిక మాంద్యం పరిస్థితుల కారణంగా లే ఆఫ్ ప్రకటించక తప్పటం లేదని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు కంపెనీ సీఈవో జామి లాన్నోన్ నుంచి సంస్థ ఉద్యోగులకు సందేశాలు వెళ్లాయి. జూమ్ కాల్స్‌లో ఆయా ఉద్యోగులకు లే ఆఫ్ సమాచారాన్ని టీమ్ లీడర్లు, వివిధ విభాగాల బాస్‌లు అందజేస్తున్నారని లాన్నోన్ చెప్పారు. కొవిడ్-19 సంక్షోభం సమయంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఆన్‌లైన్ లావాదేవీలు జరిపారు. దీంతో ఆయా టెక్ కంపెనీలు తమ సిబ్బందిని పెంచాయి. ఇప్పుడు తమ లాభాల మార్జిన్‌ను పెంచుకునేందుకు గూగుల్, అమెజాన్, ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, టిక్‌టాక్ .. కంపెనీలు లే ఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలోనే వాయిస్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వందల మందిని గూగుల్ తొలగించిన విషయం తెలిసిందే.

## వృద్ధాప్యంలో అత్త సంరక్షణను కోడలే చూసుకోవాలి

**జార్ఖండ్ హైకోర్టు**

రాంచీ, జనవరి 24: వృద్ధాప్యంలో ఉన్న అత్త సంరక్షణ బాధ్యత కోడలే చూసుకోవాలని, ఇది భారతీయ సంప్రదాయమని జార్ఖండ్ హైకోర్టు పేర్కొన్నది. విడాకుల కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. భర్త తల్లి, అమ్మమ్మల బాగోగులు కోడలే చూసుకోవాలని, వారి నుంచి విడిపోయి వేరుగా కాపురం పెట్టాలని భర్తపై ఒత్తిడి చేయరాదని జస్టిస్ సుభాష్ చంద్ స్పష్టంచేశారు. విడాకుల కేసులో (రుద్ర నారాయన్ రే వర్సెస్ ప్రియాలీ రే ఛటర్జీ) రూ.30 వేలు భార్యకు, రూ.15 వేలు కుమారుడికి మనోవర్తి చెల్లించాలని దుమ్కాలోని ఫ్యామిలీ కోర్టు తీర్పు చెప్పగా, దీనిని సవాల్ చేస్తూ భర్త హైకోర్టును ఆశ్రయించాడు. ఎలాంటి కారణం లేకుండా భర్త నుంచి విడిపోయినట్టయితే, మనోవర్తి (మెయింటనెన్స్) పొందే హక్కు భార్యకు ఉండదని ఈ కేసులో న్యాయమూర్తి స్పష్టం చేశారు. కుటుంబంలో మహిళల ప్రాముఖ్యతను తెలుపుతూ 'మనుస్మృతి'లో పేర్కొన్న విషయాల్ని న్యాయమూర్తి తన తీర్పులో ప్రస్తావించటం గమనార్హం.

## సుప్రీంకోర్టు జడ్జిగా కర్ణాటక హైకోర్టు సీజే



న్యూఢిల్లీ, జనవరి 24: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య (34) మళ్లీ పూర్తిస్థాయి సామర్థ్యాన్ని చేరుకుంది. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుల మేరకు కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నియామకంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 34కు చేరుకోనున్నది. గత నెలలో సుప్రీంకోర్టు జడ్జి ఎస్‌కే కౌల్ రిటైర్ అవ్వటంతో, ఆయన స్థానంలో జస్టిస్ ప్రసన్న బి.వరాలే పేరును సూచిస్తూ కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. 'జస్టిస్ ప్రసన్న ఇప్పుడున్న హైకోర్టు జడ్జీల్లో అత్యంత సీనియర్. అంతేగాక హైకోర్టు సీజేల్లో ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు. దీంతో ఆయన పేరును పరిగణనలోకి తీసుకున్నాం' అంటూ నెలరోజుల క్రితం కేంద్రానికి పంపిన సిఫారసుల్లో కొలీజియం పేర్కొన్నది.

## పిల్లల్లో ఫుడ్ అలర్జీనా? జాగ్రత్త!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): శిశువుల్లో తరచూ ఏర్పడే ఫుడ్ అలర్జీతో భవిష్యత్తులో వారిలో ఆరోగ్య సమస్యలు మరింత పెరుగొచ్చని ఆస్ట్రేలియాలోని ముర్డోచ్ చిల్డ్రన్స్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ తాజా పరిశోధనలో తేలింది. చిన్నప్పుడు ఫుడ్ అలర్జీ బారిన పడిన పిల్లలు ఆరేండ్ల వయసు వచ్చేనాటికి అస్తమా వంటి రోగాలు, ఊపిరితిత్తుల ఎదుగుదలలో సమస్యలు ఎదుర్కొనవచ్చని ఈ అధ్యయనం హెచ్చరించింది. 5,276 మంది నవజాత శిశువులపై ఈ పరిశోధన నిర్వహించారు. ఈ వివరాలు లాన్సెట్‌లో ప్రచురితమయ్యాయి.

## ప్రపంచ ఉత్తమ నగరాల్లో ముంబైకి 12వ ర్యాంక్

న్యూఢిల్లీ: 'టైమ్ ఔట్' విడుదల చేసిన ప్రపంచంలో టాప్-50 నగరాల జాబితాలో ముంబై పన్నెండో స్థానంలో ఉంది. భారత్ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక నగరం ముంబై మాత్రమే. జాబితాలో న్యూయార్క్, కేప్ టౌన్, లండన్, బెర్లిన్, మ్యాడ్రిడ్ మొదటి ఐదు స్థానాలను దక్కించుకున్నాయి. నగరాల్లో లభించే ఆహారం, వాటిలోని భవన నిర్మాణ రీతులు, సాంస్కృతిక సంపద వంటివాటిపై ప్రజాభిప్రాయం, నిపుణుల విశ్లేషణల ఆధారంగా ఈ జాబితాను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఈ నగరాల్లో నివసించడం పట్ల ప్రజలు ఏ మేరకు సంతోషంగా ఉన్నారనే దానిని బట్టి ర్యాంకులను ఇచ్చినట్లు వెల్లడించింది.

## కోడికి పోలీసుల సెక్యూరిటీ



*ఛండీగఢ్: పందెం బరిలో గాయపడిన ఒక కోడికి పోలీసులు సెక్యూరిటీ ఏర్పాటు చేశారు. రక్షణ కల్పించడమే కాకుండా గాయపడిన ఆ కోడికి చికిత్స అందించి, ఆహారం కూడా పెడుతున్నారు. పంజాబ్‌లోని బఠిండా జిల్లా బలువానా గ్రామంలో అక్రమంగా కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పందెం బరిలో గాయపడిన రెండు కోళ్లను దవాఖానకు తరలించగా.. ఒకటి చనిపోయింది. మరోదానిని కాపాడిన పోలీసులు.. దాన్ని నిందితులకు వ్యతిరేక సాక్ష్యంగా కోర్టుకు తీసుకెళ్తామని చెప్పారు.*



## విద్యతో దీర్ఘాయుష్షు!

*లండన్: పాఠశాలలో లేదా కళాశాలలో గంటల తరబడి జరిగే తరగతులకు హాజరయ్యేందుకు రోజూ ఉదయాన్నే త్వరగా నిద్ర లేవడం మనలో చాలా మందికి విసుగును, బాధను కలిగించవచ్చు. కానీ, విద్యకు మన ఆయుర్దాయానికి ప్రత్యక్ష సంబంధం ఉన్నట్టు తాజా అధ్యయనం తేల్చింది. విద్యా సంస్థలో చదువుకునేందుకు మనం ఎన్నేండ్లు వెచ్చిస్తే మన జీవితకాలం అంత మేరకు పెరుగుతుందని ఆ అధ్యయనం వెల్లడించింది. జీవితంలో ఎన్నడూ పాఠశాలకు హాజరు కాకపోవడం రోజుకు 10 సిగరెట్ల ధూమపానం లేదా ఐదు సీసాల మద్యం సేవించినంత హానికరమని స్పష్టం చేసింది. విద్య లేనివారితో పోలిస్తే పాఠశాల, ఉన్నత పాఠశాల, డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన వారికి మరణ ముప్పు 34% తక్కువగా ఉంటుందని తెలిపింది. ఈ అధ్యయనంలో భాగంగా 59 దేశాల నుంచి సేకరించిన 600కుపైగా వ్యాసాలను విశ్లేషించారు.*



## సౌదీలో తొలి మద్యం దుకాణం

*రియాద్: ముస్లిమేతర దౌత్యవేత్తల కోసం ప్రత్యేకంగా ఓ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు సౌదీ అరేబియా సన్నాహాలు చేస్తున్నది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కస్టమర్లు మొబైల్ యాప్ ద్వారా తమ పేర్లను రిజిస్టర్ చేసుకుని, ఫారిన్ మినిస్ట్రీ నుంచి అనుమతి పొందాలి. నెలవారీ కోటాకు అనుగుణంగా మద్యం కొనుక్కోవచ్చు. కొద్ది రోజుల్లోనే ఈ దుకాణాన్ని తెరవబోతున్నారు. ఇస్లాం ప్రకారం మద్యపానంపై నిషేధం ఉంది. అయితే సౌదీ అరేబియాను పర్యాటక, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చేసేందుకు యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుత చట్టాల ప్రకారం, సౌదీ అరేబియాలో మద్యపానం చేసినవారికి కఠిన శిక్ష తప్పదు.*